హవ్వా.. నిర్వహణ ఇలా..!?

- కాటన్ బ్యారేజ్‌పై వెలగని లైట్లు
- ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కాటన్ బ్యారేజ్‌పై వెలగని లైట్లు

ధవళేశ్వరం: ఉభయ గోదావరి జిల్లాల వరప్రదాయిని కాటన్ బ్యారేజ్ నిర్వహణను ఇరిగేషన్ అధికారులు మరిచారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కాటన్ బ్యారేజ్‌పై లైట్లు పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో అంధకారం రాజ్యమేలుతోంది. బ్యారేజ్‌పై చీకటిగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అదేవిధంగా బ్యారేజ్‌పై వర్షపు నీరు బయటకు వెళ్లే హోల్స్ మట్టి, చెత్తతో మూసుకుపోవడంతో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండే పరిస్థితి నెలకొంది. దీనివల్ల కట్టడానికి ముప్పు పొంచి ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. బ్యారేజ్ ఫుట్‌పాత్ వద్ద రాళ్లు పైకి లేవడంతో ప్రమాదకరంగా మారింది. కాటన్ బ్యారేజ్ ఫుట్‌పాత్‌పై నిత్యం పగటిపూట వందల సంఖ్యలో ప్రజలు వాకింగ్‌కు వస్తుంటారు. ఫుట్‌పాత్ రాళ్ల మధ్యలో కాళ్లు ఇరుక్కుని అనేక మంది గాయాలపాలు కావడం పరిపాటిగా మారింది. బ్యారేజ్ ఫుట్‌పాత్‌పై పిచ్చి మొక్కలు సైతం పెరగడంతో కట్టడానికి పగుళ్లు వచ్చే పరిస్థితి నెలకొంది.

గతంలో ప్రత్యేక సిబ్బంది

బ్యారేజ్ నిర్వహణకు గతంలో ప్రత్యేక సిబ్బంది ఉండేవారు. ఎప్పటికప్పుడు చెత్త,మట్టిని తొలగించడంతో ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రస్తుతం నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేయడంతో కాటన్ బ్యారేజ్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

సగానికి పైగా..

కాటన్ బ్యారేజ్‌పై ధవళేశ్వరం, ర్యాలీ, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌ల్లోని 175 గేట్ల పరిధిలో సగానికిపైగా లైట్లు వెలగడం లేదు .దీంతో రాత్రి సమయాల్లో ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అనేక మంది రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

చెత్త తొలగించే వారేరి?


కాటన్ బ్యారేజ్‌పై చెత్త, ఫుట్‌పాత్‌లపై పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు గతంలో ప్రత్యేక సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం నిర్వహణను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో బ్యారేజ్‌పై మట్టి పేరుకుపోయి నీరు వెళ్లే రంధ్రాలు సైతం మూసుకుపోయే దుస్థితి నెలకొంది.



ప్రమాదకరంగా బ్యారేజ్ ఫుట్‌పాత్‌పై రాళ్లు



బ్యారేజ్ ఫుట్‌పాత్ పక్కన పిచ్చి మొక్కలు



చెత్తతో మూసుకుపోయిన వర్షపు నీరు వెళ్లే రంధ్రాలు

ప్రతిపాదనలు పంపాం

కాటన్ బ్యారేజ్‌పై లైట్లకు సంబంధించి మరమ్మతులను త్వరలోనే చేపడతాం. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– ఆర్ కాశీవిశ్వేశ్వరరావు, హెడ్‌వర్క్స్ ఈఈ

క్లుప్తంగా

మృదంగ మహారాణి బిరుదుతో నాగలక్ష్మికి సత్కారం



నాగలక్ష్మికి బిరుదు ప్రదానం చేస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: నగరంలోని విజయశంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మికి మృదంగ మహారాణి బిరుదుతో సత్కరించారు. విజయవాడలోని కౌతాపూర్ణానందం కళావేదికలో సంగీత సామ్రాట్ ఎంఎస్ బాలసుబ్రహ్మణ్య శర్మ స్మారక సంస్థ, తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే. పోలవరపు సాంస్కృతిక, శ్రీకళా భారతి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ బిరుదుతో సన్మానించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఆమెను అభినందించారు. అఖిల భారత స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయ వేదికలపై జరిగిన ప్రఖ్యాత సంగీత విద్వాంసుల కచేరీలకు మృదంగంపై సహకరించి, నాలుగున్నర దశాబ్దాలుగా సంగీత సేవ చేసినందుకు ఈ పురస్కారం అందుకున్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ గ్లౌజుల బహూకరణ



స్పోర్ట్స్ గ్లౌజ్‌లను విద్యార్థులకు బహూకరిస్తున్న వెంకటేశ్వరరావు

రాజానగరం: దివాన్‌చెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా అదే గ్రామంలోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు ఆ విద్యార్థులను అభినందిస్తూ, రూ.15 వేల విలువైన స్పోర్ట్స్ గ్లౌజులను ఉచితంగా అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రుక్మాబాయి

రాజానగరం: ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలను కలిగి, దేశాభివృద్ధిలో భాగస్వామి కావాలని రిటైర్డ్ ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ రుక్మాబాయి అన్నారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, వివేకానంద కేంద్ర కన్యాకుమారి రాజమండ్రి సభ సంయుక్త ఆధ్వర్యంలో యువత నాయకత్వ లక్షణాలు అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి ధనరాజ్ మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో యువత దేశభక్తిని, సంస్కృతి, సంప్రదాయాలను ఏకీకృతం చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల మధ్య చర్చా గోష్ఠి జరిగింది. కొంతమంది విద్యార్థులు యోగాసనాలు వేసి, యోగా సాధనపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ విద్యాశాఖాధికారి డాక్టర్ వీకే రమణ, జి.శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వీర్రాజు

సీతానగరం: ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించుకుని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసీ నియంత్రణ కార్యాలయ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ బి.వీర్రాజు వివరించారు. మండలంలోని మిర్తిపాడు జెడ్పీ హైస్కూల్లో శనివారం ఆయన కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఈ ఏసురాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుష్టు వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదని, మైకో బ్యాక్టీరియా లెప్రా అనే క్రిమి వల్ల వచ్చే అంటువ్యాధని చెప్పారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చ రూపంలో ఇది కనిపిస్తుందన్నారు. దీనిని వెంటనే గుర్తించి, చికిత్స తీసుకుంటే పూర్తిగా తగ్గిపోతుందన్నారు. అశ్రద్ధ చేస్తే అంగ వైకల్యం సంభవిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎస్ త్రినాథ్, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ బి.శైలజ, ఏఎన్ఎం బి.కుమారి, డీఈఓ బి.విజయ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉత్తమం



శాటిలైట్‌సిటీ జెడ్పీ స్కూల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై అంకారావు



ఆనంద్‌నగర్ స్కూల్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు

కంబాలచెరువు: పిల్లల అభివృద్ధికి తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉత్తమమైందని సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఆనందనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లోసాయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే తల్లిదండ్రుల శ్రమతో పాటు, పర్యవేక్షణ కూడా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా మహిళలకు రంగోలీ పోటీలు, మగవారికి క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.లక్ష్మి, వైస్ చైర్మన్ మద్రే రాధాకృష్ణ మాట్లాడారు. స్థానిక గాంధీపురం–2 సుంకర భాస్కరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. స్థానిక నాగరాజ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మోటూరి మంగారాణి ఏర్పాటు చేసిన సెల్ఫీ స్పాట్ వద్ద తల్లిదండ్రులు ఉత్సాహంగా ఫొటోలు దిగారు.

ప్రభుత్వ బడుల్లో సందడి

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో మెగా పేరెంట్–టీచర్స్ మీటింగ్‌లతో సందడి నెలకొంది. తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ, తల్లులకు ముగ్గుల పోటీలు, మగవారికి టగ్‌ఆఫ్‌వార్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎంలు పాఠశాల ప్రగతిని వివరించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాటిలైట్‌సిటీ జెడ్పీ స్కూల్‌లో హెచ్‌ఎం బత్తిన రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. బొమ్మూరు ఎస్సై అంకారావు మాదకద్రవ్యాల వల్ల అనర్థాలను వివరించారు. బొమ్మూరు జెడ్పీ స్కూల్‌లో మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ కామిని ప్రసాద్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. కొంతమూరులో ఎంఈవో–1 తులసీదాస్, కాతేరు స్కూల్‌లో ఎంఈవో–2 చందుకుమార్ పాల్గొన్నారు. హుకుంపేట స్కూల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ఇచ్చింది మూరెడు.. ఖర్చు బారెడు

మీటింగులు పెట్టండి, కానీ డబ్బు అడగొద్దు.. భోజనాలు పెట్టండి, ఖర్చు మాత్రం చెప్పొద్దు.. డెకరేషన్లు చేయండి, ఆ బిల్లులు మాకు ఇవ్వొద్దు.. ఇదీ తీరుగా మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లు కొనసాగాయి. ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన ఈ కార్యక్రమంతో ఉపాధ్యాయులకు చేతిచమురు వదిలింది. ప్రభుత్వం పది మందికి రూ.వెయ్యి, 25లోపు రూ.1,2 వందలు, 50లోపు రూ.1,6 వందలు, 75లోపు రూ.2 వేలు, 100లోపు రూ.24 వందలు, 200లోపు రూ.3 వేలు, 300లోపు రూ.4వేలు, 400లోపు రూ.5వేలు, 500లోపు రూ.6వేలు, 600లోపు రూ.7వేలు, 700లోపు రూ.8వేలు, 800లోపు రూ.9వేలు, 900లోపు రూ.10వేలు, 1000లోపు రూ.11వేలు, 1500లోపు రూ.12వేలు, 2000లోపు రూ.13వేలు, 3000కు, ఆపైన రూ.14వేల చొప్పున బడ్జెట్‌ను విడుదల చేసింది. వీటితోనే ఉపాధ్యాయులు కార్యక్రమం జరపాలంటే చేతిచమురు వదిలించుకోక తప్పలేదు. టెంట్లు, కుర్చీలు, డెకరేషన్, పోటీల బహుమతులు, మంచినీరు, భోజనాలు ఇలా అన్ని ఖర్చులు తడిసిమోపుడైంది.

ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి సోపానాలు



కడియం హైస్కూల్‌లో కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

కడియం: ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వ పాఠశాలలు ఏ మాత్రం తీసిపోవని, ఇక్కడ చదివిన వారు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారని స్థానిక ఏవీఆర్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. గత నాలుగేళ్లుగా జరిగిన పాఠశాల అభివృద్ధిని ఆయన వివరించారు. కడియం సీఐ ఏ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి మేరకు రామదాసు పేపర్ బోర్డు చైర్మన్ ఎన్.శివ శంకర్ రెడ్డి పాఠశాలకు 20 టీచర్ టేబుళ్లను, ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో స్కూలు ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చిన వారికి నగదు, గోల్డ్ మెడల్లను అందజేస్తామన్నారు. సరస్వతీదేవి విగ్రహాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తానని పూర్వ విద్యార్థి పాఠంశెట్టి సూరిబాబు హామీ ఇచ్చారు. దాతలు ఉప్పులూరి హనుమంతరావు, ప్రసాద్, సూరిబాబును, సన్మానించారు. పలు పోటీల విజేతలకు సర్పంచ్ ఎం.సత్యవతి, ఎస్ఎంసి అధ్యక్షురాలు గారపాటి సత్య బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. గతేడాది ఆరు నుంచి పదో తరగతి వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంపీడీవో రమేష్ ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫ్రీ అరెస్టుపై న్యాయ విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఫ్రీ అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశలలో అందుబాటులో ఉన్న న్యాయసేవలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ నిందితులను కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలను కచ్చితంగా నిందితుడికి, అతడి కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో తనకు నచ్చిన న్యాయవాదిని కలిసే హక్కు ఉంటుందన్నారు. అలాగే న్యాయవాది లేని పక్షంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను, ఉచిత న్యాయవాదిని పొందవచ్చన్నారు. నోటీసు, అరెస్టు మొదలుకుని, చార్జ్‌షీట్, విచారణ, రిమాండ్ లాంటి ప్రతి దశలోనూ నిందితుడి హక్కులకు భంగం కలగకుండా పోలీసు అధికారులు తమ విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, విశ్రాంత అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.విశ్వనాథం పాల్గొన్నారు. అలాగే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి, 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు హాజరై మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందన్నారు.

వైభవంగా షష్ఠి వేడుకలు

- వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు
- స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు



బొమ్మూరు వడ్డివీరభద్రనగర్‌లో నాగమ్మ తల్లి సంబరంలో గరగలతో ఊరేగింపు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని ప్రధానాలయమైన వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఉపాలయాలతో పాటు, స్థానిక కోరుకొండ రోడ్డులోని ఆలయంలో స్వామివారిని దర్శించుకోవడానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఈ దేవాలయం వందేళ్ల పైబడి చరిత్ర కలిగింది. ఇక్కడ స్వామివారు నాగబంధ శివలింగంతో కూడి ఉంటారు. సుబ్రహ్మణ్యేరుడు ప్రధాన ఆలయం కలిగిన దేవాలయం ఇదొక్కటే కావడం విశేషం. భక్తుల కోసం దేవదాయ శాఖ, ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. గోదావరి గట్టున ఉన్న శృంగేరి జగద్గురు శారదా మఠం, శంకర పీఠంలో అష్ట నాగదేవత సహిత వల్లీదేవసేన సంతాన సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. గాయత్రీ అక్షర పీఠంలోని సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు జరిగాయి.

అందరిపై స్వామి కటాక్షం ఉండాలి

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీ సమేతంగా స్థానిక కోరుకొండ రోడ్డులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు కలిసి జక్కంపూడి రాజా దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ, సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామి వారిని దర్శించుకుంటే సర్వాభీష్టాలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకమన్నారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలతో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

షష్ఠి మహోత్సవం.. ఆధ్యాత్మిక శోభితం

రాజమహేంద్రవరం రూరల్: వల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలు శనివారం వైభవంగా మొదలయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. హుకుంపేటలోని ప్రత్యక్ష నాగదేవత ఆలయం(పాముల గుడి)లో షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నపూర్ణ సమేత కాశీ నాగలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. పాములు ప్రత్యక్షమైన బావి వద్ద ఏర్పాటుచేసిన పుట్టకు పూజలు చేశారు. ప్రధానార్చకుడు బాపిరాజుశర్మ నేతృత్వంలో ఆలయ నిర్వాహకులు సింగిడి గంగరాజు, సింగిడి గంగాధరరావు, సింగిడి సురేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బొమ్మూరు వడ్డివీరభద్రనగర్‌లో ఉన్న నాగదేవత ఆలయంలో షష్ఠి మహోత్సవం సందర్భంగా పాలూరి సోమేశ్వరరావు, కాలనీ యూత్ ఆధ్వర్యంలో నాగమ్మ తల్లి సంబరం వైభవంగా నిర్వహించారు. మహిళలు గరగలతో నృత్యాలు చేస్తూ వీధులలో తిరిగారు. బొమ్మూరు వెంకటగిరికొండపై ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు జరిగాయి, వంశపారంపర్య ధర్మకర్త కామిని ప్రసాద్‌చౌదరి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నందూరి శ్రీకృష్ణపరమాత్మ పూజాదికాలు నిర్వహించారు. కొంతమూరు ఆఫీషియల్‌కాలనీలోని షణ్ముఖ పీఠంలో చక్రసహిత వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు స్కందస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు సంప్రదాయ దుస్తులతో గర్భాలయంలో మూలవిరాట్‌కి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కడియం: మండలంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో షష్ఠి వేడుకలు నిర్వహించారు. కడియంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంతో పాటు, దుళ్లలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరుడిని, బుర్రిలంక, వేమగిరి, జేగురుపాడు, మురమండ, వీరవరం, దామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. పూల పడగలు స్వామివారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల వద్ద భక్తుల భారీ క్యూలు కనిపించాయి. ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించాయి.



జక్కంపూడి రాజా దంపతులకు స్వాగతం పలుకుతున్న సుబ్రహ్మణ్యం



కోరుకొండ రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం వద్ద బారులు తీరిన భక్తులు



హుకుంపేట పాముల గుడిలో పూజలు చేస్తున్న భక్తులు



బుర్రిలంకలో సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు



పాముల గుడి ఆవరణలో బావి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

హజ్రత్ ఖకార్ష దర్గాలో ఖురాన్ పఠనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని గూడ్స్ షెడ్ వద్ద ఉన్న హజ్రత్ ఖకార్ష ఖాదరి ఔలియా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం ఖురాన్ పఠనం నిర్వహించారు. ఆదివారం ఉరుస్ జరుగుతుందని దర్గా ఆర్గనైజర్, ముజావర్ షేక్ అల్లాబక్ష్ తెలిపారు. ఈ సందర్భంగా గుర్రం, ఫకీరు మేళాలతో ఊరేగింపు, అనంతరం గంధోత్సవం ఉంటుందని వివరించారు. ఉదయం, సాయంత్రం మహాన్నదానం జరుగుతుందని చెప్పారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ మెన్స్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ముగిశాయి. ఐడీఎల్ కళాశాల కాకినాడ, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేవీటీ కళాశాల, కొయ్యలగూడెం ప్రకాష్ కళాశాల జట్లు వరుస స్థానాల్లో నిలిచారని పోటీల చైర్మన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు. విజేతలు ఈ నెల 21 నుండి 28 వరకు కాలికట్‌లో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు.

లారీ, ట్రాక్టర్ల సీజ్

కంబాలచెరువు: వెంకటనగరం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ లారీ, రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతంలో దాడి చేశారు. లారీ, ట్రాక్టర్లతో పాటు. మినీ జేసీబీని కూడా సీజ్ చేశారు. దీనిపై మూడో నగర పోలీసులు కేసు నమోదు చేశారు.

నరసింహస్వామిని దర్శించుకున్న గీతాకృష్ణ

మధురపూడి: కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహ స్వామిని సినీ దర్శకుడు గీతాకృష్ణ శనివారం దర్శించుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రాంతంతో తనకు అనుబంధం ఉందన్నారు. తన స్వగ్రామం కడియం మండలం మాధవరాయుడు పాలెమని, ఇక్కడి ఆధ్యాత్మిక ప్రాంతాల్లో నిర్మించిన సినిమాలన్నీ విజయవంతమైనట్టు వివరించారు.

సినిమాలు



శ్యామల	:	పుష్ప–2
సూర్యమినీ	:	పుష్ప–2
సూర్యప్యాలెస్	:	పుష్ప–2
శివజ్యోతి	:	పుష్ప–2
అనుశ్రీ	:	పుష్ప–2
స్వామి	:	పుష్ప–2
అశోక	:	పుష్ప–2
రాజా	:	పుష్ప–2
రంభ	:	పుష్ప–2
ఊర్వశి	:	పుష్ప–2
మేనక	:	పుష్ప–2
కుమారి	:	పుష్ప–2
అప్సర	:	పుష్ప–2
నామవరం		
వీఎస్ మహల్	:	పుష్ప–2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	పుష్ప–2
కడియం		
వెంకటసూర్య	:	పుష్ప–2